సాక్షి ప్రకాశం

సోమవారం । 9 । జనవరి । 2023



శాప్ లీగ్ జిల్లా జట్ల ఎంపిక

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఫేజ్ 2 లీగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఆదివారం ఒంగోలులో నిర్వహించారు. ఫుట్‌బాల్, రెజ్లింగ్, బాక్సింగ్, వాలీబాల్ జట్లను ఎంపిక చేశారు.

- 8లో..



పంట కోసం రైతు పాట్లు

అడవి పందులు, కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29 /19

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి ప్రజలకు సూచించారు. పండుగ రోజులు కావడంతో థియేటర్స్, షాపింగ్ మాల్స్, ప్రయాణాల్లో ప్రజలకు తప్పకుండా మాస్కులు ధరించాలన్నారు. కోవిడ్ రెండో మోతాదు, బూస్టర్ డోసు తీసుకోని వారు ఉంటే తప్పకుండా వ్యాక్సిన్ చేయించుకోవాలన్నారు. ఎవరికైనా ఆయాసం, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని ముందస్తు జాగ్రత్తలు వహించాలని కోరుతూ ఒక ప్రకటనలో తెలిపారు.

నాగులుప్పలపాడు ఎస్సైగా వి.హరిబాబు

ఒంగోలు: నాగులుప్పలపాడు ఎస్సైగా వి.హరిబాబును నియమిస్తూ ఎస్పీ మలికాగర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. హరిబాబు ప్రస్తుతం డీసీఆర్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. తక్షణమే ఆయనను డీసీఆర్‌బీ నుంచి రిలీవ్ చేసి నాగులుప్పలపాడులో విధుల్లో జాయినయ్యేందుకు తగు చర్యలు చేపట్టాలంటూ డీసీఆర్‌బీ డీఎస్పీ, రూరల్ సీఐని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.

మర్రిపూడిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ పీ అంకమ్మరావు

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పృధులగిరి లక్ష్మీ నృసింహస్వామి కబడ్డీ టోర్నమెంట్‌లో మొత్తం 20 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మొదటిగా గురపప్పడి, కనిగిరి, దర్శి, కనిగిరి-2ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలను ఎస్‌ఐ పీ అంకమ్మరావు ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా రూ.7,116, తృతీయ బహుమతిగా రూ.5,116, జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి గెలిచిన టీమ్ సభ్యులకు రూ.3,116, ద్వితీయ బహుమతి గెలిచిన టీమ్ సభ్యులకు రూ.2,116 నగదును బహుమతిగా ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

హనుమంతునిపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా నేటి నుంచి సీతారాంపురం (తురకపల్లి) గ్రామంలో కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు లగాన్ యూత్‌ఫోర్స్ కమిటీ సభ్యులు తెలిపారు. ఆసక్తి గల టీమ్‌లు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి తానిగుండాల లక్ష్మీరెడ్డి రూ.30,116, రెండో బహుమతి సానికొమ్ము తిరుపతిరెడ్డి రూ 20,116 అందజేస్తారన్నారు. ఎవరి కిట్ వారే తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 8349329117, 9182578306, 9182158285 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒంగోలు నగరం రూపురేఖలు మారుతున్నాయి. నగర పాలక సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూడున్నరేళ్లలో రూ.137.79 కోట్లు వెచ్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నగరంలోని ప్రతి ఇంటింటికీ తిరుగుతూ డివిజన్లలోని సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారు. నూతన నగర పాలకమండలి ఏర్పడిన తరువాత రెండో బడ్జెట్ నేడు ప్రవేశపెట్టనున్నారు.

ఒంగోలు నగర పరిధి పీర్లమాన్యంలో పూర్తయిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



ఇదిగో అభివృద్ధి..

మూడున్నరేళ్లలో రూ.137.79 కోట్లతో పనులు

- ఒంగోలు నగరంలో వేగంగా అభివృద్ధి పనులు
- మౌలిక వసతుల కల్పన దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కొనసాగుతున్న 'అమృత్' పథకం పనులు
- నేడు మేయర్ గంగాడ అధ్యక్షతన 2023-24 బడ్జెట్ సమావేశం
- రూ.209 కోట్లతో అంచనా బడ్జెట్ సమావేశం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరం సమగ్ర అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. ఏడాదికి ఏడాదికి పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని విస్తరిస్తున్న నగరాన్ని పరిగణలోకి తీసుకొని ప్రజల అవసరాలు తీర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. భవిష్యత్తు తరాలకు కూడా మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. నగర ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు. ఒంగోలు నగరంలో బాలినేని మార్క్ అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చేయటమే లక్ష్యంగా యంత్రాంగాన్ని ఉరుకులు.. పరుగులు పెట్టిస్తున్నారు. ప్రస్తుతం ఒంగోలు నగర జనాభా 3,01,572 మందికి చేరింది.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు బాలినేని ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో వేలాది మంది అర్హులైన పేదలు, మధ్య తరగతి వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు ఇంటింటికీ వెళుతున్న బాలినేనికి స్వయంగా లబ్ధిదారులు 'ఇది మీరు ఇచ్చిన ఇల్లే వాసన్నా' అంటూ కృతజ్ఞతలు చెబుతున్నారు.

కోట్ల రూపాయలతో మౌలిక వసతుల కల్పన

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒంగోలు నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపడుతున్నారు. నగరంలో మొత్తం 50 డివిజన్లలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టేందుకు 1013 పనులు మంజూరు చేశారు. అందుకుగాను రూ.101.67 కోట్ల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయటానికి పూనుకున్నారు. వాటిలో ఇప్పటికే 641 పనులు పూర్తయ్యాయి. మరో 71 పనులు కొనసాగుతున్నాయి. 301 పనులు ప్రారంభించాల్సి ఉంది.

■ 2019 నుంచి 2022 వరకు షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్ కింద మొత్తం రూ.కోటి వెచ్చించి 12 పనులు చేపట్టి పూర్తి చేశారు. ఎంపీ లాడ్స్ కింద రూ.20 లక్షలు వెచ్చించి నాలుగు పనులు పూర్తి చేశారు.

■ 2019-20 ఆర్థిక సంవత్సరానికి 14వ ఫైనాన్స్ కింద మంచినీటి సరఫరా పనులతో పాటు మొత్తం 3 పనులకు రూ.6.84 కోట్లు వెచ్చించారు.

■ 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘంలో భాగంగా మొత్తం 29 పనులు చేపట్టారు. అందుకుగాను రూ.16.87 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో 6 పనులు పూర్తి కాగా మరో 14 పనులు ప్రారంభించాల్సి ఉంది.

ఒంగోలు నగరంలో ప్రజల ఆరోగ్యానికి సంబంధించి నూతనంగా ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరయ్యాయి. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం రూ.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. వాటిలో కొన్ని పూర్తికాగా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. మరో నాలుగు పాత అర్బన్ హెల్త్ సెంటర్లను ఒక్కో దానిని రూ.10 లక్షలు వెచ్చించి ఆధునీకీకరించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద ఆరు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.1.58 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం 20 పనులు మంజూరు చేసింది. అందుకోసం ఒక్కో డివిజన్‌కు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసింది.

ఇప్పటికే 11 పనులు ప్రారంభించి జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల్లో భాగంగా మూడు పనులకు గాను రూ.22.95 లక్షలు మంజూరు చేశారు. వాటిలో రెండు పనులు జరుగుతున్నాయి. మరొక పనిని ప్రారంభించాల్సి ఉంది. జగనన్న హరిత నగరాల్లో భాగంగా ఒంగోలు నగరంలో మొక్కలు నాటడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు రూ.2.62 కోట్లు కేటాయించారు. పచ్చదనాన్ని పెంపొందించే ప్రణాళికలు ప్రారంభించారు. గుండ్లకమ్మ నుంచి ఏర్పాటు చేసిన మంచి నీటి పథకం అమృత్ మొదటి విడత పనులు రూ.75 కోట్లతో కొనసాగుతున్నాయి.



వెంకటేశ్వర కాలనీలో పూర్తయిన సిమెంట్ రోడ్డు



11వ డివిజన్‌లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, పక్కన మేయర్ గంగాడ (ఫైల్)

రూ.209 కోట్లతో అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టనున్న వైనం

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సోమవారం జరగనున్న ఒంగోలు నగర పాలక సంస్థ పాలక మండలి రూ.209 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో బడ్జెట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పాలక మండలి ఏర్పాటైన తరువాత ప్రవేశపెడుతున్న రెండో బడ్జెట్ ఇది. ఆదాయం, రాబడులు, జీతాలు, ఒంగోలు నగర పాలక సంస్థ నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అన్నీ కలుపుకొని రూ.196 కోట్ల ఖర్చు లు పోను రూ.13 కోట్ల మిగులుతో కౌన్సిల్ ఆమోదించనుంది.

మౌలిక వసతుల కల్పన దిశగా అడుగులు



ఒంగోలు నగరంలో మౌలిక వసతుల కల్పన దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాను. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నాం. నగర శివారు ప్రాంతాల్లోనూ ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించాం. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను రూపొందించాం. కౌన్సిల్ సమావేశంలో చర్చ అనంతరం ఆమోదింపజేసుకొని ముందుకు సాగుతాం.

– ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు నగర పాలక సంస్థ

క్రీడా స్ఫూర్తిని చాటండి



క్రీడల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే రాంబాబు, డీఎస్పీ కిషోర్‌కుమార్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పాల్గొన్న ఎమ్మెల్యే రాంబాబు

మార్కాపురం టౌన్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రంలో ఆదివారం మార్కాపురం స్పోర్ట్స్ అండ్ యోగా క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పురుషుల డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ మార్కాపురంలో రెండు రాష్ట్రాల స్థాయి టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. క్రీడల ప్రోత్సాహానికి, క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం కాసేపు మంత్రి సురేష్, ఎమ్మెల్యే రాంబాబు, డీఎస్పీ కిషోర్‌కుమార్‌లు షటిల్ ఆడారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, యర్రగొండపాలెం మార్కెట్‌యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, పెద్దదోర్నాల మాజీ ఎంపీపీ అమిరెడ్డి రామిరెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, అమీర్‌బాషా, కృష్ణారెడ్డి, జాతీయ స్థాయి బ్యాట్‌మెంటన్ రెఫరి జిలాని, గుండారెడ్డి శ్రీనివాసరెడ్డి, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

నల్లమలలో ఎంఈఈ టీం పర్యటన



నల్లమలలో పర్యటిస్తున్న టీం సభ్యులు

- పచ్చర్ల, బైర్లూటి, తుమ్మలబైలు సఫారీలను పరిశీలించిన టీం సభ్యులు
- గిరిజనులకు టైలరింగ్, చేతివృత్తుల శిక్షణ పరిశీలన

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలోని వనాలు, వన్యప్రాణులను సంరక్షించటంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని మేనేజ్‌మెంట్ ఎఫెక్టివ్‌నెస్ ఎవల్యూషన్ (ఎంఈఈ) టీం సభ్యులైన రిటైర్డు పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్)లు మెహరోత్ర, వాసు, ఉపాధ్యాయ్‌లు అటవీశాఖ అధికారులకు సూచించారు. ఆదివారం ప్రకాశం, నంద్యాల జిల్లాలోని నల్లమల అభయారణ్యంలో అన్ని ముఖ్య ప్రాంతాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు అవసరమైన నీటి వసతి, ఆహార కల్పన అంశంతో పాటు వాటి మనుగడకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో సంచరించేందుకు అవసరమైన భద్రత చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సహజ సిద్ధంగా ఉండే మైదాన ప్రాంతాల్లో జీవించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపే శాఖాహార జంతువుల కోసం గడ్డి ఆవాసాలు, వాటి సంరక్షణకు కంచెలు ఏర్పాటు చేయటం వంటి కార్యక్రమాలను పకడ్బందీగా రూపొందించాలని వారు తెలిపారు. దీంతో పాటు వన్యప్రాణుల నీటి అవసరాలు తీర్చేందుకు చెక్ డ్యామ్‌లు, నీటి కుంటల అభివృద్ధి వంటి వాటితో పాటు భద్రతా చర్యల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నల్లమలలో టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దేశంలో పేరెన్నికగన్న పులుల అభయారణ్యమైన నల్లమల అటవీ ప్రాంతంలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలు గుర్తెరిగి విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గిద్దలూరు రేంజి పరిధిలోని పచ్చర్ల, నంద్యాల జిల్లా ఆత్మకూరు పరిధిలోని బైర్లూటి, పెద్దదోర్నాల పరిధిలోని తుమ్మలబైలు ఎకోటూరిజం కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని గణపతి చెక్‌పోస్టు వద్ద చేపట్టిన గిరిజనుల టైలరింగ్, చేతివృత్తుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన టీం సభ్యులు అక్కడ జరుగుతున్న శిక్షణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌లు అలెన్ చాంగ్ టిరాన్, నరసింహారావు, విఘ్నేష్ అపావు, బయోడైవర్సిటీ ఏసీఎఫ్ ధనరాజ్, పెద్దదోర్నాల రేంజి అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గ్రూప్-1 పరీక్షలు



ఒంగోలులో ఏకేవీకే కాలేజీ వద్ద గ్రూప్-1 పరీక్ష రాసేందుకు క్యూలో ఉన్న అభ్యర్థులు



గ్రూప్-1 పరీక్షలు జరుగుతున్న కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఓ ఓబులేసు

- 7 కేంద్రాల్లో పరీక్ష
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఆర్‌ఓ

ఒంగోలు అర్బన్: ఏపీపీఎస్సీ ద్వారా ఆదివారం జిల్లాలో నిర్వహించిన గ్రూప్-1 సర్వీసులకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలో ఒంగోలులో 5, టంగుటూరు మండలంలో 2 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సమయంలో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 5531 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 3894 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. దీంతో పరీక్షలకు 70.4 శాతం హాజరైనట్లు డీఆర్‌ఓ తెలిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగిన పరీక్షలకు 7 పరీక్ష కేంద్రాల్లో 5531 మంది హాజరు కావాల్సి ఉండగా 3882 మంది హాజరై 70.18 శాతం హాజరు నమోదైంది. పరీక్షల్లో ఎటువంటి ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగాయని డీఆర్‌ఓ తెలిపారు.

గ్రూప్ 1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఈమేరకు పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు తగు సూచనలు జారీచేస్తూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టారు. ఉదయం స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రం, నాగార్జున డిగ్రీ కాలేజీ, క్విస్ కాలేజీతోపాటు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రదేశంగా భావించి 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలో క్విస్ కాలేజీ, హర్షిణి డిగ్రీ కాలేజీ, ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ, నాగార్జున డిగ్రీ కాలేజీ, ఏకేవీకే కాలేజీ, పేస్, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్షలు జరుగుతుండడంతో వాటన్నింటి వద్ద భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అదనపు ఎస్పీ వెంట ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ విజేత ప్రకాశం

మేదరమెట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతగా ప్రకాశం జట్టు నిలిచింది. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామ పరిధిలోని భ్రమర టౌన్‌షిప్ ఆధ్వర్యంలో పోటీలు ఆదివారం రాత్రి 11 గంటల వరకు రసవత్తరంగా సాగాయి. మూడు, నాలుగు స్థానాల కోసం తూర్పుగోదావరి, కృష్ణా జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో తూర్పుగోదావరి 33, కృష్ణా జట్టు 28 పాయింట్లు సాధించగా 5 పాయింట్ల తేడాతో తూర్పుగోదావరి విజయం సాధించి మూడో స్థానంలో నిలిచింది. అంతకుముందు జరిగిన మొదటి సెమీస్‌లో ప్రకాశం, కృష్ణా జట్లు తలపడగా ప్రకాశం జట్టు 30 పాయింట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. రెండో సెమీస్‌లో రంగారెడ్డి, తూర్పుగోదావరి జట్లు మధ్య జరగ్గా రంగారెడ్డి 7 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టు విజయం సాధించి ఫైనల్‌లో అడుగు పెట్టింది. ఫైనల్ మ్యాచ్ రంగారెడ్డి, ప్రకాశం జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. రంగారెడ్డి 22 పాయింట్లు సాధించగా, ప్రకాశం జట్టు 34 పాయింట్లు సాధించి 12 పాయింట్ల తేడాతో విజేతగా నిలిచింది. మొదటి బహుమతి రూ.లక్షతో పాటు ట్రోఫీని, రెండో బహుమతి రూ.75 వేలు, ట్రోఫీ, మూడో బహుమతి రూ.50 వేలు ట్రోఫీ, నాలుగో బహుమతి రూ.25 వేలు విజేతలకు అందజేశారు. బహుమతుల కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భ్రమర టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఫైనల్ పోటీలో తలపడుతున్న ప్రకాశం, రంగారెడ్డి జట్లు

క్లుప్తంగా

ఉర్దూ టీచర్ల సమస్యల పరిష్కారంపై దృష్టి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్

మార్కాపురం: రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి, టీచర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఆదివారం మంత్రి తన నివాసంలో ఉర్దూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అన్వర్ బాషా, పీ.హిదయతుల్లాఖాన్, ఉపాధ్యక్షులు షేక్ బురాని పీరా, పలువులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కలయిక రాజకీయ వ్యభిచారం

- ఎంతమంది కలసినా ప్రజల విశ్వాసాన్ని మాత్రం పొందలేరు
- ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



చీరాల రూరల్: చంద్రబాబు, ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ కలయిక రాజకీయ వ్యభిచారంతో సమానమని, ఎంత మంది కలిసినా ప్రజల విశ్వాసాన్ని మాత్రం పొందలేరని అటువంటి వారి కలయికతో జనగన్న ప్రభుత్వానికి ఎటువంటి ఢోకాలేదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. ఆదివారం రాత్రి ఆమె కొత్తపేటలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చంద్రబాబు, జగన్ అవకాశవాద రాజకీయాలకు తెర లేపుతున్నారని తెలిపారు. గతంలో కూడా ఒకసారి ఇద్దరూ కలసి విడిపోయారని, ప్రస్తుతం మళ్లీ కలుస్తున్నారని, అటువంటి వారు ఎంతమంది కలిసినా జననేత ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఎటువంటి ప్రమాదం లేదన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎప్పుడో ప్రజల మనస్సుల్లో నుంచి తొలగిపోయారని, పవన్ కళ్యాణ్ అయితే ప్యాకేజి స్టార్‌గా చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడికి ఇంకా పదవీ కాంక్ష, అధికార కాంక్ష తగ్గలేదని, ఇంకా ప్రజలను దోచుకోవడానికే చూస్తున్నారని విమర్శించారు. అధికారం కోసం ప్రజలను ఓ భిక్షగాడి మాదిరిగా అడుక్కుంటున్నారన్నారు. ఆయనకున్న ప్రచార పిచ్చితో అమాయక ప్రజలను పొట్టనపెట్టుకుంటున్నారని.. అందుకు ఉదాహరణే కందుకూరులో 8 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని, గుంటూరులో కూడా 3 ప్రాణాలు పోయారని చెప్పారు. ఆ రెండు సంఘటనల్లో పవన్ కళ్యాణ్ ఆయా బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. వారి ప్రాణాలంటే లెక్క లేదా అని అన్నారు. ఇప్పటంలో ఎటువంటి నష్టం జరగకపోయినా కావాలనే హైకోర్టులో కేసులు వేయించి కోర్టు ద్వారా మొట్టికాయలు వేయించుకున్న చరిత్ర పవన్ కళ్యాణ్‌దని చెప్పారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



రైలు పట్టాలపై మృతి చెందిన జాన్సన్

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాల కారణంగా రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. నంద్యాల జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన నూనె జాన్సన్ (43) అనే వ్యక్తి పట్టణంలోని ఓ సప్లయర్స్‌లో పనిచేస్తుంటారు. జాన్సన్‌కు అతడి భార్య బెస్లీల మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ కుటుంబ కలహాలు జరిగేవని ఆ కారణంగానే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. జాన్సన్ మొదటి భార్య నుంచి విడిపోయి బెస్లీని 11 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి నాలుగు నెలల పాప ఉంది. ఎస్సై అబ్దుల్ జలీల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పురాతన వినాయక స్వామి విగ్రహం అపహరణ

తాళ్లూరు: మండల కేంద్రంలోని పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయంలో పురాతన వినాయక స్వామి విగ్రహాన్ని దుండగులు అపహరించారు. పూజారులు ఆదివారం ఉదయం దేవాలయానికి వెళ్లగా అపహరణకు గురైన విషయాన్ని గమనించారు. గతంలో కూడా రెండు పర్యాయాలు విగ్రహాన్ని అపహరించిన దుండగులు పొలాల్లో దాచి పెట్టగా కనుగొన్న రైతులు తిరిగి దేవాలయానికి చేర్చారు. అయితే మరలా మూడోసారి అపహరణకు గురికావటం భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎస్సై నరసింహారావు విచారిస్తున్నారు.



పంట పొలాల చుట్టూ చుట్టిన చీరలు



పంట పొలాల్లో కోతుల గుంపు



పంటలను పాడు చేసే పందులు



వరి పంట వద్ద సీసాతో ప్రయోగం

పంట కోసం రైతు పాట్లు

కొనకనమిట్ల: వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి రైతులు పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. సాగు చేపట్టినప్పటి నుంచి ప్రకృతి వైపరీత్యాల వల్ల, పురుగు మందులు, తెగులు బెడదతో సతమతమవుతుంటారు. అలాగే పశ్చిమ ప్రాంతంలో అయితే కోతులు, పందులు దాడులు చేసి నోటికాడకొచ్చే పంట పాడు చేస్తున్నాయి. రాత్రిపూట పందులు బెడద, పగలు కోతులు, కాకులు బెడదతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అలసంద, మినుము, జొన్న, వరి పంట గింజలు బాగా ముదరడంతో పంట దగ్గరికి ప్రతి రోజూ కాపలా వెళ్లి రాత్రిళ్లు జాగారం చేయక తప్పటం లేదు. ఒక్క రోజు ఆదమరిచి నిద్రపోయినా నెలపాటు కాపాడుకున్న పంటను ఒక్క రాత్రిలోనే పందుల గుంపు సర్వనాశనం చేస్తాయి. అందుకే రైతులు తమ పొలాల్లో మంచెలు నిర్మించుకుని కాపలా కాస్తున్నారు. రాత్రిపూట మంచెల వద్ద తాటాకు మంటలు వేసుకుంటూ, డప్పులు చప్పుడు చేసుకుంటూ, పెద్దగా అరుస్తూ పందుల గుంపులను బెదిరిస్తున్నారు. పొలాల చుట్టూ కర్రల సాయంతో చీరలను కడుతున్నారు. కొందరు రైతులు మైక్‌లతో సౌండ్ చేస్తూ పంటను కాపాడుకుంటున్నారు.



చేలో వేసిన గుడిసె

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఘన నివాళి

- గడిచిన నెల 27న చీమకుర్తి బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- స్పాట్‌లో ఒకరు, చికిత్స పొందుతూ శనివారం మరొకరు మృతి
- నివాళులర్పించిన మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాతికింది కొండయ్య (48)కు పట్టణ పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదివారం కూనంనేనివారిపాలెంలో నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గత నెల 27న చీమకుర్తి బైపాస్‌లో రామతీర్థం నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్న రెండు టిప్పర్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో రామతీర్థం వైపు వస్తున్న టిప్పర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రామతీర్థం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ రాతిక్రింది కొండయ్య తీవ్రంగా గాయపడి ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా కొండయ్య కుమారుడు రాతిక్రింది మనోజ్ మంత్రి ఆదిమూలపు సురేష్ వద్ద వ్యక్తిగత సేవలు అందిస్తున్నాడు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రాతికింది కొండయ్య (ఫైల్)

ఒకే ఇంటిలో వరుస విషాదాలు

చీమకుర్తి: ఒకే ఇంటిలో వరుస విషాదాలు చుట్టుముట్టాయి. కూనంనేనివారిపాలెంలో ముగ్గురు అన్నదమ్ములు వేరు వేరు సమయాల్లో ప్రమాదాలకు గురై మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య మేనళ్లులు అయిన నలుగురులో రాతికింది కొండయ్య గడిచిన నెల 27న చీమకుర్తి బై పాస్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కొండయ్య చిన్న తమ్ముడు చినకొండయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ గతంలో బొల్లాపల్లి హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మరో తమ్ముడు నరసింహారావు బేల్దారి పనులు చేస్తూ భవనంపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఇలా ఒకే ఇంటిలో నలుగురు అన్నదమ్ముల్లో ముగ్గురు మృతి చెందటాన్ని వారి కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఆస్తి వివాదాలపై కత్తులతో దాడులు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న గోవింద్

మార్కాపురం: ఆస్తి పంపకాలపై జరిగిన ఘర్షణలో ఇద్దరికి కత్తి పోట్లు తగిలాయి. పట్టణంలోని విజయ టాకీస్ ప్రాంతంలో నివాసం ఉండే అంగులూరి గోవింద్‌కు గోపాల్‌కు మధ్య ఆస్తి పంపకాలపై విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గోపాల్, వెంకటేశ్వర్లు మరి కొంత మంది కత్తులతో తమపై దాడి చేశారని గోవింద్ తెలిపాడు. అతని భార్య లక్ష్మీకి కూడా గాయాలు కావటంతో వారివురు జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై శశికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చాకు నీకు పడదయ్యా..!

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి మృతితో కుటుంబంలో రోదనలు



ఈసం రమేష్ (ఫైల్)

కందుకూరు రూరల్: మర్రిపూడి మండలంలోని నర్సరాజుపాలెం గ్రామం వద్ద పచ్చాకు కూలీల ట్రాలీ ఆటో శనివారం బోల్తా పడిన ఘటనలో కందుకూరు మండలం విక్కిరాలపేట గ్రామానికి చెందిన ఈసం రమేష్ (45) బ్రెయిన్ డెడ్ అవడంతో గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రమేష్ భార్య, భర్తలు హైదరాబాద్‌లో బేల్దారీ పనికి వెళ్లారు. కుమార్తె కాన్పు కావడంతో స్వగ్రామానికి వచ్చారు. భార్యను కుమార్తె వద్ద ఉంచి తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. ఈ లోపు కుమారుడికి ప్రమాదంలో కాలు దెబ్బతగిలింది. తిరిగి మళ్లీ ఇంటికి వచ్చాడు. ఇంటి వద్దే ఉన్న రమేష్ గ్రామస్తులంతా పచ్చాకు కూలీ పనులకు వెళ్తుండడంతో ఒక రోజు వెళ్తానని చెప్పి వెళ్లాడు. పచ్చాకు నీక పడదయ్యా... పనికి వెళ్లాలనుకుంటే బెల్దారి పనికి వెళ్లు అని భార్య, కుమార్తెలు చెప్పారు. అయినా కూలి కోసం తొలి రోజు వెళ్లి మృతి చెందాడు. ఒక్క రోజు కూలి కోసం వెళ్లి శాశ్వతంగా కానరాకుండా వెళ్లావా అని బంధువుల రోదనలు చూపరులను కంట తడి పెట్టించాయి.

శాప్ లీగ్ జిల్లా జట్ల ఎంపిక



ఫుట్‌బాల్ జిల్లా జట్టు



రెజ్లింగ్ జిల్లా జట్టు

ఒంగోలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఫేజ్ 2 లీగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఆదివారం ఒంగోలులో నిర్వహించారు. స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీలో ఫుట్‌బాల్, రెజ్లింగ్, బాక్సింగ్, వాలీబాల్ జట్ల ఎంపిక స్థానిక మినీ స్టేడియంలో జరిగాయి. టంగుటూరు, వై.పాలెం, మార్కాపురం, గిద్దలూరు, ఒంగోలు, వెలిగొండ, సింగరాయకొండ, కనిగిరి ప్రాంతాల నుంచి క్రీడాకారులు విచ్చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఈ నెల 18,19 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. రెజ్లింగ్ ఈ నెల 11న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో, బాక్సింగ్ జట్టు ఫిబ్రవరి 5న విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో, వాలీబాల్ జట్టు ఈ నెల 29వ తేదీ తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్టెప్ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి తెలిపారు.



బాక్సింగ్ జిల్లా జట్టు

పాలుట్లలో గంజాయి స్వాధీనం



గంజాయి మొక్కలను గుర్తిస్తున్న సెబ్ అధికారులు

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గిరిజన గూడెం పరిధిలో ఆదివారం సెబ్ సీఐ ఎన్.వెంకటరమణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎస్పీ మలికా గర్గ్, అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో 43 గంజాయి మొక్కలను వారు స్వాధీనం చేసుకున్నారు. పాలుట్లకు చెందిన నినావత్ బలరాం నాయక్ మిరప తోటలో 35 గంజాయి మొక్కలు, జండవత్ బద్దు నాయక్ తోటలో 8 గంజాయి మొక్కల ప్రకారం స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ కానిస్టేబుళ్లు పి.వెంకటేశ్వర్లు, సి.రమేష్ బాబు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి బాలుడు మృతి

బల్లికురవ: గాలి పటం ఎగరేస్తూ నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. ఈఘటన ఆదివారం బల్లికురవ మండలంలోని కొత్తూరు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం మేరకు.. బాపట్ల ప్రాంతానికి కర్నెకంటి యువరాజు ఏడేళ్ల క్రితం పాస్టర్‌గా ఇక్కడకు వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు హెడ్సన్‌రాజు (6) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. గ్రామం నుంచి కొప్పరపాడు వెళ్లే రోడ్డులో సొసైటీ భవనం పక్కన రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి తీసిన పిల్లర్ గుంతల వద్ద గాలి పటం ఎగరవేస్తూ గుంతలో పడిపోయాడు. తోటి విద్యార్థులు హెడ్సన్‌రాజు గుంతలో పడిన విషయాన్ని గుర్తించలేదు. తల్లిదండ్రులు చర్చిలో ప్రార్థనలు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి బిడ్డ కనిపించకపోవటంతో గ్రామంలో వెతికారు. తోటి విద్యార్థులు సొసైటీ భవనం సమీపంలో ఆడుకుంటున్నాడని చెప్పటంతో ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా నీటి గుంతలో పడి చనిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు భోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాధ ఛాయలు అలముకున్నాయి.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన అజయ్‌బాబు

వేటపాలెం: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం అక్కాయిపాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నానికి చెందిన ఎండ్లూరి అజయ్‌బాబు (35) బైక్‌పై అక్కాయిపాలెం వెళ్తున్నాడు. అదే సమయంలో వేటపాలేనికి చెందిన సయ్యద్ బాజీ షరీఫ్ కారులో చీరాల వెళ్తున్నాడు. బైక్‌పై అజయ్‌బాబు రోడ్డు దాటుతున్న సమయంలో కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌తో సహా కిందపడిన అజయ్‌బాబు తలకు బలమైన గాయమై మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో వ్యక్తిపై దాడి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద ఓ వ్యక్తి కత్తితో మరో వ్యక్తి పై దాడి చేసి గాయపరచిన సంఘట ఆదివారం జరిగింది. వెంగళ్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైష్టవ కుమార్ అనే సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు అదే గ్రామానికి చెందిన హరికృష్ణలకు వారి ఇంటి వద్ద ఓ విషయంలో ఘర్షణ జరిగింది. వీరిద్దరూ సమీప బంధువులు కాగా వీరి మధ్య తలెత్తిన వివాదంలో హరికృష్ణ కత్తితో వైష్టవ కుమార్‌ను గాయపరిచాడు. చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు స్థానికులు తరలించారు.